క్లుప్తంగా

అందుబాటులో ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న రీజినల్ మేనేజర్ పవన్‌కుమార్

పగిడ్యాల: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 108 స్టేషన్ సిబ్బంది అందుబాటులో ఉంటూ అత్యవసర రోగులకు సేవలు అందించాలని 108 రీజినల్ మేనేజర్ పవన్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక 108 అంబులెన్స్ సెంటర్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అత్యవసర సేవలకు గానూ 108 అంబులెన్స్ వాహనాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. వాహనంలో తరలించే రోగుల వివరాలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అఖిల్ యాదవ్ ఉన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాములపాడు: స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 30 మందికి క్రీడాకారులకు కాటం ట్రేడర్స్ అధినేత, కాటం ప్రశాంత్‌రాజు శనివారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. అనంతరం హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి, పీడీ రాజశేఖర్‌లు దాతను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సోమశేఖర్, రవి, శ్రీనివాసులు, రామక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొణిదేలలో..



దుస్తులు పంపిణీ చేస్తున్న న్యాయవాది వెంకటేశ్వర్లు, మైన్స్ ఓనర్ చిట్టిన్న

నందికొట్కూరు: మండల పరిధిలోని కొణిదేల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు రూ.20 వేల విలువ చేసే క్రీడాదుస్తులను న్యాయవాది వెంకటేశ్వర్లు, మైన్స్ ఓనర్ చిట్టిన్న శనివారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీరామచంద్రమూర్తి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నందీశ్వరస్వామికి పరోక్షసేవ



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శనివారం 36 మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామికి విశేష పూజను జరిపించుకున్నారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజను చేశారు. అనంతరం పంచామృతాలు, ఫలోదకాలు, మల్లికాగుండంలోని శుద్ధజలంతోనూ అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్ర పాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

మహానందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం



నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన మహానందీశ్వర స్వామికి శనివారం ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకరఅవధాని, ఆలయ ముఖ్య అర్చకులు రాజమాణిక్యశర్మ ప్రదోష కాలంలో అభిషేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్ష, పరోక్ష సేవల ద్వారా పూజల్లో పాల్గొన్నారు. అలాగే యాగశాలలో నవగ్రహ, మృత్యుంజయ, ధన్వంతరి హోమాలు వైభవంగా నిర్వహించారు.

అనుమతుల్లేకుండా టపాసులు నిల్వ చేయొద్దు

నందికొట్కూరు: అనుమతుల్లేకుండా టపాసులు నిల్వ ఉంచితే చట్ట పరమైన చర్యలు తప్పవని టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గవర్నమెంట్ జూనియర్ కళాశాల ఆవరణలోని మైదానంలోని కేటాయించిన ప్రదేశంలో మాత్రమే టపాసులు విక్రయించాలన్నారు. టపాసులు విక్రయ ప్రాంతంలో నీరు, ఇసుక, అగ్నిమాపక సామగ్రి అందుబాటులో ఉంచాలన్నారు. లైసెన్స్ కలిగిన దుకాణదారులు మాత్రమే టపాసుల విక్రయాలు జరపాలన్నారు.

పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేసే కుట్ర

- కూటమి ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ధ్వజం



డిజిటల్ బుక్ క్యూర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న శిల్పా చక్రపాణిరెడ్డి



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

శ్రీశైలంప్రాజెక్ట్: పేద విద్యార్థులకు వైద్య విద్యను కూటమి ప్రభుత్వం దూరం చేసేందుకు కుట్ర చేస్తోందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి విమర్శించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శ్రీశైలంప్రాజెక్ట్‌లోని కృష్ణవేణి కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో శిల్పా పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో వైద్య కళాశాలలను తాకట్టు పెడుతోందని, తద్వారా పేద విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లు దక్కవని, అదే మాదిరి పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందదని శిల్పా అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పెద్దల అండతో నకిలీ మద్యం విచ్చలవిడిగా తయారవుతుందని, ఊరూరా బెల్ట్‌షాపుల్లో మద్యం ఏరులై పారుతుందని అన్నారు. ఇటువంటి చర్యల వల్ల పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు నష్టపోతున్నాయని, ఇటువంటి చర్యలను ప్రజలు సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కోటి సంతకాల కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎంఏ రజాక్, నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు వట్టి వెంకటరెడ్డి, నాయకులు శోభన్ బాబు, భరత్‌రెడ్డి, మూగెన్న, మహమ్మద్‌ఖాశీం, సీతారాంనాయక్, సీహెచ్ పుల్లయ్య, వెంకట్, గౌస్‌మొహిద్దీన్, దమయంతి, ప్రభావతి, మేరి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

కూటమి ప్రభుత్వ వేధింపులకు ఎవరూ భయపడవద్దని, ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ధైర్యం చెప్పారు. పాలనను గాలికొదిలి ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేయడమే కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుందన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అనుచరులు శ్రీశైలంలో ఇద్దరు కార్యకర్తలపై భౌతిక దాడికి పాల్పడ్డారన్నారు. పార్వతి అనే మహిళ వ్యాపార దుకాణానికి అడ్డుగా గోడ కట్టడంతోపాటు దేవస్థానంలోని పని చేస్తున్న కొందరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను సైతం తొలగించారన్నారు. సున్నిపెంటలో తమ పార్టీ నాయకుడు వట్టి వెంకటరెడ్డి నిర్మించుకున్న భవనాన్ని సైతం ప్రభుత్వానికి స్వాధీన పరచాలని నోటీసులు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే అనుచరులు శ్రీశైల దేవస్థానం ఆదాయానికి భారీగా గండికొడుతూ దర్శనం, ప్రత్యేక పూజల టికెట్లను బ్లాక్‌లో విక్రయించుకుంటున్నారని, 185 అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలను అమ్ముకున్నారని, దేవస్థానంలో టెండర్లకు వచ్చిన వారిపై దౌర్జన్యం చేశారని, టన్ను ఇసుక్‌పై రూ.200 కప్పం వసూలు చేస్తున్నారని, డీలర్ల ద్వారా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. ఎవరికి అన్యాయం జరిగానా వెంటనే డిజిటల్ బుక్‌లో వివరాలు నమోదు చేయాలని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వేధించిన, అన్యాయానికి పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

జీఓను రద్దు చేయించడం సిగ్గుచేటు

దశాబ్దాలుగా ఏ హక్కులు లేని శ్రీశైలం, సున్నిపెంట, లింగాలగట్టు గ్రామాల అభివృద్ధి కోసం తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విడుదలైన జీఓను 40ను బుడ్డా రాజశేఖరరెడ్డి ఎమ్మెల్యే కాగానే రద్దు చేయించడం సిగ్గుచేటని శిల్పా విమర్శించారు. జీఓ నం.40తో ఆయా గ్రామాలను పంచాయతీలుగా గుర్తింపు పొంది, ఇక్కడి నివాసిత ప్రజలకు భూమిపై హక్కు కల్పించే అవకాశం ఏర్పడిందన్నారు.

మల్లన్న సేవలో శిల్పా



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శనివారం మల్లన్న దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు విచ్చేసిన శిల్పాకు అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. మల్లికార్జున స్వామికి అభిషేకం, భ్రమరాంబా దేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆయన వెంట నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, తదితరులు ఉన్నారు.

కార్తీక పూజలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాసరెడ్డి

మహానంది: ఈనెల 22 నుంచి నవంబరు 20 వరకు నిర్వహించనున్న కార్తీకమాస పూజలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయనున్నట్లు మహానంది ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవస్థాన కార్యాలయంలో శనివారం ఈఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వేకువజామున 4.30 గంటల నుంచే స్వామిఅమ్మవార్లకు మహామంగళహారతుల అనంతరం దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. రాత్రి 10 నుంచి 10.30గంటల వరకు కామేశ్వరీదేవి మహానందీశ్వరస్వామివార్లకు ఏకాంతసేవ పూజలు ఉంటాయన్నారు. నవంబరు 5న కార్తీకపౌర్ణమి సందర్భంగా కోటిదీపోత్సవం, 18న లక్షబిల్వార్చన, 19న లక్షకుంకుమార్చన పూజలు ఉంటాయన్నారు. గర్భిణులు, చిన్నపిల్లలు ఉన్నవారితో పాటు వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఏఈఓ వై.మధు, ఆలయ సూపరింటెండెంట్లు శశిధర్‌రెడ్డి, నీలకంఠరాజు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

నేడు కోటి సంతకాల సేకరణకు శ్రీకారం

నందికొట్కూరు: కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం కోటి సంతకాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ తెలిపారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ఉదయం పట్టణంలోని 17వ వార్డులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెక్రటరీ జబ్బార్ ఇంటి నుంచి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు పగిడ్యాలలో, సాయంత్రం 3 గంటలకు జూపాడుబంగ్లా, 4 గంటలకు మిడుతూరు మండల పరిధిలోని తలముడిపి గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా పాల్గొని ప్రజలతో సంతకాలు సేకరించాలన్నారు.

టోల్‌ప్లాజా సిబ్బంది ఇష్టారాజ్యం



స్కూల్ బస్సులకు నెలవారి పాసు రూ.1000 అని ప్రచురించిన బోర్డు

పాములపాడు: టోల్‌ప్లాజా సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నేషనల్ హైవే 340సీ నిర్మాణం పనులు పూర్తి కాకుండానే హడావుడిగా ప్రారంభించి టోల్ వసూలు చేస్తున్న సిబ్బంది.. స్కూల్ బస్సులకు రూ.1000లకు నెలవారి పాస్ ఇవ్వకుండా రాకపోకలు సాగించిన ప్రతిసారి టోల్ ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. కాగా టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్‌పై స్కూల్ బస్సులకు నెలవారి పాస్ రూ.1000 ఉండటాన్ని గుర్తు చేయగా అదంతా ఫేక్ అని, అప్పటికప్పుడు స్టిక్కర్ అతికించి కనిపించకుండా చేయడంతో వాహనదారులు ముక్కున వేలేసుకున్నారు.

సంక్షిప్తం

కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ఆత్మకూరు: కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్, ఉపాధ్యక్షులు డి.సామన్న డిమాండ్ చేశారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్ష చేపట్టారు.

స్థానిక వాహనాలకు రాయితీ ఇవ్వాలి

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన టోల్ ప్లాజాలో స్థానిక టాటా మేజిక్ ప్యాసింజర్ వాహనాలకు టోల్ రుసుములో రాయితీ ఇవ్వాలని ఐటీయూసీ, సీపీఐ నాయకులు కోరారు. శనివారం వారు టోల్ ప్లాజా వద్ద ధర్నా నిర్వహించారు. నందికొట్కూరు నుంచి ఆత్మకూరుకు రాకపోకలు సాగిస్తున్న ప్యాసింజర్ వాహనాలకు నెల వారి పాసులు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అనంతరం టోల్ ప్లాజా మేనేజర్ ముఖేష్‌కు వినతి పత్రం అందజేశారు.

చేతుల శుభ్రతపై అవగాహన

జూపాడుబంగ్లా: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద చేతుల శుభ్రతపై ఎంపీడీఓ గోపికృష్ణ, ఏపీఎం అంబమ్మ శనివారం అవగాహన కల్పించారు. వాష్ రూంకు వెళ్లొచ్చాక చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. భోజనానికి ముందు, తర్వాత కూడా చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

జూపాడుబంగ్లా: ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఇచ్చే రాయితీలను సద్వినియోగం చేసుకుని పండ్లతోటలు, కూరగాయలు, పూలతోటలు సాగుచేసుకుని వ్యవసాయంలో రాణించాలని నందికొట్కూరు హార్టికల్చర్ అధికారిణి తేజశ్విని రైతులకు సూచించారు.

వాహనాల తనిఖీ

నందికొట్కూరు: పట్టణ శివారులో టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ శనివారం వాహనాలను తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలను నడపరాదని, ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సూచించారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

ఆత్మకూరు: పట్టణంలో నాయీబ్రాహ్మణుల సమక్షంలో శనివారం పగిడ్యాల శివ పాములేటి అధ్యక్షతన ధన్వంతరి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ధన్వంతరి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేజీబీవీ ప్రాంగణానికి గ్రిల్ ఏర్పాటు

బండి ఆత్మకూరు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రాంగణానికి ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ దాక్షాయని తెలిపారు. కోతుల బెడదతో విద్యార్థినులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రహిమాన్ సిఫార్సు మేరకు రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. దీంతో ఐరన్ గ్రిల్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు.



గ్రిల్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రహిమాన్

ఏఈ నియామకంపై లోకాయుక్తకు ఫిర్యాదు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఎలక్ట్రికల్ విభాగంలో ఏఈ (ప్రస్తుతం ఇన్‌చార్జ్ డీఈ)పీవీ సుబ్బారెడ్డి నియామకం చట్టవిరుద్ధమని ఎం.సుస్మిత లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. శనివారం లోకాయుక్త సూచనతో ఎలక్ట్రికల్ ఏఈ నియామకంపై విచారణ చేపట్టాలని దేవదాయశాఖ కమిషనర్ ఈఓకు నోటీసులు జారీ చేశారు. 14 రోజుల్లో కమిషనర్ కార్యాలయానికి నివేదిక పంపాలని ఈఓను కమిషనర్ ఆదేశించారు.

ఏబీఎం చర్చిలో అగ్నిప్రమాదం



కాలిపోయిన ఫ్యాన్లు, కుర్చీలు, వస్తువులు

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల గ్రామంలో ఉన్న ఏబీఎం చర్చిలో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఫ్యాన్లు, లైట్లు, యాంప్లి ఫ్లైయర్, కుర్చీలు కాలిపోయినట్లు సంఘం పెద్దలు శనివారం తెలిపారు. రాత్రి ప్రార్థన ముగించుకుని చర్చికి తాళం వేసి ఇళ్లకు వెళ్లిన అనంతరం విద్యుదాఘాతం సంభవించినట్లు తెలిపారు. దాదాపు రూ.3 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లువారు తెలిపారు. సర్పంచ్ బాలమద్దిలేటి, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య చర్చిని పరిశీలించారు.

బీమా చెక్కు పంపిణీ



కుళ్లాయమ్మకు చెక్కు అందజేస్తున్న మేనేజర్ శ్రీనివాసులు

ఆత్మకూరురూరల్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాధితుడి కుటుంబానికి ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన(పీఎంజేజేబీవై) చెక్కును యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ శనివారం అందజేశారు. కురుకుంద గ్రామానికి చెందిన తెలుగు రామలింగేశ్వర పీఎంజేజేబీవై పాలసీదారుడు. అతడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతచెందడంతో నామినీ అయినా అతని భార్య కుళ్లాయమ్మకు మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును మేనేజర్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీసీఎఫ్ఎల్ ప్రాజెక్ట డైరెక్టర్ ఆంజనేయులు, మేనేజర్ అశోకకుమార్, కౌన్సిలర్లు శంకరయ్య, విజయరాజు, వీఓఏ తిమ్మదాసు, గ్రామ నాయకులు మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ బేబి

నందికొట్కూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ బేబి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రంగముని సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయం నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటామంటూ అధికారులు, సిబ్బంది, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

- కొత్తపల్లి: డిప్యూటీ తహసీల్దార్ అరుణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు.
- పగిడ్యాల: ఎంపీడీఓ సుమిత్రమ్మ, తహసీల్దార్ శివరాముడుల ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీలో జెడ్పీటీసీ పుల్యాల దివ్య పాల్గొన్నారు.
- జూపాడుబంగ్లా: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ గోపికృష్ణ, డిప్యూటీ ఎంపీడీఓ పద్మావతి తదితరులు ఎంపీడీఓ కార్యాలయ పరిసరాల్లోని పిచ్చిమొక్కలను గ్రీన్‌అంబాసిడర్లతో కలిసి తొలగించారు.
- బండి ఆత్మకూరు: మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రహిమాన్, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ గాయత్రి పాల్గొన్నారు.
- ఆత్మకూరు: మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండు వరకు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించారు.

కార్తీక పూజలకు వేళాయె!

- పూజలందుకునేందుకు రుద్రకోటేశ్వరుడు సన్నద్ధం
- ఈనెల 22 నుంచి వచ్చే నెల 22 వరకు కార్తీక మాస పూజలు
- నవంబర్ 5న లక్ష దీపోత్సవం
- ఏర్పాట్లలో నిర్వాహకులు నిమగ్నం



రుద్రకోడూరు పుణ్యక్షేత్రం

ఆత్మకూరు: నల్లమల అభయారణ్యంలో అత్యంత ప్రాచీనమైన రుద్రకోడూరు పుణ్యక్షేత్రం కార్తీకమాస పూజలకు సిద్ధమైంది. ఈనెల 22 నుంచి నవంబర్ 22వ తేదీ వరకు కార్తీకమాస వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కార్తీకమాసంలోని నాలుగు సోమవారాలు రుద్రాణి, రుద్రకోటేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పురోహితులు నల్లబోతుల నారాయణ తెలిపారు. ప్రతిరోజూ వేకువజామున 4 గంటలకు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించనున్నామన్నారు. రుద్రాణి మాతకు కుంకుమార్చనలు, అలంకార పూజలు ఉంటాయన్నారు. నవంబర్ 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నామన్నారు. 6న క్షేత్రంలో శివపార్వతుల కల్యాణం, సత్యనారాయణవ్రతం కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పురోహితులు తెలిపారు.

క్షేత్ర చరిత్ర..

నల్లమల అటవీ పరిధిలోని రుద్రకోడు క్షేత్రం అతి పురాతనమైనది. వందల ఏళ్ల క్రితమే వెలసిన ఈ క్షేత్రంలో క్షేత్రంలో మహాశివుడు కైలాసంలో పార్వతీదేవితో స్వల్పవిషయంపై అలిగి భూలోకానికి వచ్చే సమయంలో స్వయంభూ లింగాకారంగా అవతరించారని, స్కాందపురాణం తెలుపుతోంది. ఇక్కడ బ్రహ్మతో సహా ముక్కోటి దేవతలు రుద్రుడైన మహాశివుడిని శాంతింపజేసేందుకు తరలివచ్చినట్లు తెలుస్తోంది. ఎంతో ప్రాచుర్యం కలిగిన ఈ క్షేత్రంలో రుషులు, మహాయోగులు పూజలు చేశారు. ప్రస్తుతం క్షేత్రంలో ఒకేరోజు సంగమేశ్వరం నుంచి శ్రీశైల క్షేత్రం, శ్రీశైలం నుంచి రుద్రకోడు క్షేత్రాన్ని సందర్శిస్తే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

జ్యోతి దర్శనం ప్రత్యేకం

శబరిమలైలోని అయ్యప్పస్వామి ఆలయంలో మకర సంక్రాంతి సందర్భంగా జ్యోతి దర్శనం లాగే రుద్రకోడూరు క్షేత్రంలో ఏటా కార్తీకమాసం పౌర్ణమి రోజున జ్యోతి దర్శనమివ్వడం ప్రత్యేకత. జ్యోతి దర్శనం ఓ మహాభాగ్యంగా భక్తులు భావించి పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. శివస్వాములు, అయ్యప్పస్వాములు, భక్తులు కూడా రుద్రకోడూరు క్షేత్రంలో కార్తీకమాసంలో జరిగే లక్ష దీపారాధన కార్యక్రమంలో పాల్గొంటారు.

ఇలా చేరుకోవచ్చు..

రుద్రకోడూరు మహాక్షేత్రానికి ఆత్మకూరు నుంచి నల్లకాల్వకు వెళ్లి అక్కడి నుంచి రుద్రకోడూరు క్షేత్రం చేరుకోవచ్చు. ఆత్మకూరు నుంచి నల్లకాల్వ 5 కి.మీ., నల్లకాల్వ నుంచి రుద్రకోడూరు క్షేత్రం 14 కి.మీ. దూరం ఉంది. మోటార్ బైక్, ట్రాక్టర్ల ద్వారా ఈ క్షేత్రానికి భక్తులు చేరుకోవచ్చు.

ఆత్మకూరులో వర్షం



ఆత్మకూరులో వర్షం కురుస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలో శనివారం మధ్యాహ్నం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో మొక్కజొన్న కోత కోసి ఆరబోసిన రైతుల ఇబ్బందులు పడ్డారు. వరుణుడు వదలకపోవడంతో పొలాల్లో వర్షపునీరు నిల్వ ఉండడంతో మొక్కజొన్నను కోయలేని పరిస్థితి నెలకొంది.